సాక్షి నంద్యాల

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



అహోబిలంలో పూజలు

ఆళ్లగడ్డ: అహోబిలంలో అమావాస్య సందర్భంగా సోమవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములకు పంచామృతాలతో అభిషేకించి పూజలు చేశారు.



శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు సోమవారం సహస్ర దీపార్చన సేవ చేపట్టారు. స్వామిఅమ్మవార్లను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.61
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 99.326
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,031
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:15,237

న్యూస్‌రీల్

మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో వివిధ పోలీసు స్టేషన్ల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోలీసు స్టేషన్ల ప్రకారం రాజీ కాగల కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించేలా కక్షిదారులను ప్రోత్సహించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎక్సైజ్, కుటుంబ కలహాలు, ఎంవీ, పెట్టీ కేసులను త్వరతగతిన పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సీఐ ఇస్మాయిల్, సుధాకర్ రెడ్డి, సూర్యమౌళి, దస్తగిరి, కిరణ్‌కుమార్, మల్లికార్జునగుప్తా, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

చెంచు గిరిజనులకు పక్కా గృహాలు నిర్మిస్తాం

- ఐటీడీఏ పీఓ సురేష్‌కుమార్



చెంచు గిరిజన కాలనీలో చెంచులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సురేష్‌కుమార్

పాములపాడు: జగనన్న కాలనీలో చెంచు గిరిజనులకు మంజూరైన స్థలాల్లో పక్కా గృహాలు నిర్మించి ఇస్తామని ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు అధికారి సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం వేంపెంట గ్రామంలో చెంచు గూడెం, జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కొత్త టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేస్తామని వివరించారు. అనంతరం వైద్యులు నాగలక్ష్మి, గులాబ్‌షాతో మాట్లాడారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎప్పటికప్పుడు గిరిజనులకు అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. చెంచు కాలనీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

ఘనంగా జియారత్ వేడుకలు



పెద్ద రాజు స్వామికి గంధం సమర్పిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన పెద్ద రాజు స్వామి దర్గా ఉరుసులో భాగంగా 3వ రోజు సోమవారం జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి, దర్గా నిర్వాహకులు సయ్యద్‌షా బాషా ఖాద్రి పెద్ద రాజు స్వామికి జియారత్ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో జియారత్ ఉత్సవాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు గూటుపల్లెకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సాయం నీటిమూటే!



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు నాగలింగడు. ప్యాపిలి మండలం కలచట్ల గ్రామ వాసి. తనకున్న రెండు ఎకరాల్లో టమాట సాగు చేశాడు. ఇందుకోసం రూ.లక్ష ఖర్చు చేశాడు. వాతావరణం అనుకూలించడంతో పైరు బాగా వచ్చింది. దిగుబడి వచ్చే సమయానికి మంచి రేటు పలుకుతుందనే ఆశతో ఉన్నాడు. కానీ, పది రోజుల క్రితం వచ్చిన వర్షం పంటను ముంచెత్తింది. అడుగుమేర వర్షపు నీరు చేరడంతో పైరు పూర్తిగా దెబ్బతింది. ఇప్పటివరకు అధికారులు ఈ పంటను నమోదు చేయలేదు. దీంతో పరిహారం అందుతుందా లేదా అన్న ఆందోళనలో ఉన్నాడు.



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న పుల్లయ్య డోర్నిపాడు మండలం క్రిష్టిపాడు వాసి. ఈయన కుందూనది తీరంలో మూడెకరాల వరిని సుమారు రూ.30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి సాగుచేశాడు. ఇంతలోనే కుందూకు వరదనీరు చేరడంతో మూడురోజులుగా నీటిలోనే పంటంతా ముగ్గుతోంది. మోకాళ్ల లోతులో నీరు ఏమాత్రం తగ్గక పోవడంతో మళ్లీ తిరిగి నాటువేసుకోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నాడు. వరిపంటంతా కుళ్లిపోయింటుందని ఆందోళన చెందుతున్నాడు. ప్రభుత్వం పంటనష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నాడు.



ఆత్మకూరు సమీపంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ తదితరులు

- పంటల నమోదులో ప్రభుత్వం నిర్లక్ష్యం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,85,157 ఎకరాలు
- ఇప్పటి వరకు 4,03,382 ఎకరాల్లో పంటల సాగు
- నమోదు మాత్రం 97 వేల ఎకరాలే..
- ప్రస్తుత వర్షాలతో నీట మునుగుతున్న పంటలు..
- కొన్ని మండలాల్లో వర్షాభావంతో వాడుతున్న పైర్లు
- ప్రభుత్వం నిర్లక్ష్యంతో తీవ్రంగా నష్టపోనున్న అన్నదాతలు



ఆత్మకూరులో నీట మునిగిన మొక్కజొన్న పంట

సాక్షి, నంద్యాల: రైతులపై రాష్ట్ర ప్రభుత్వం శీతకన్ను వేసింది. పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే మరిచింది. అయితే అప్పులు తెచ్చి రైతన్నలు పంటలు సాగు చేస్తున్నారు. అన్నదాతలకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారికి వెన్నుపోటు పొడిచేలా నిర్ణయాలు తీసుకుంటోంది. మరోవైపు జిల్లాలో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులుంటే .. మరికొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఒకవైపు వర్షం లేక పంటలు ఎండుముఖం పడుతుంటే మరోవైపు వర్షం ఎక్కువై పంటలు నీటమునిగి కుళ్లిపోతుండటం చూసి రైతులు దిగాలు చెందుతున్నారు.

నత్తే నయం..

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,85,157 ఎకరాలు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పత్తి, కందులు, మిరప, వేరుశనగ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటివరకు 4,03,389 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. వరి 1,64,467 ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా 63,443 ఎకరాల్లో మాత్రమే సాగైంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 78,790 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 21,020 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయితే సాగైన పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేసే ప్రక్రియ నత్త నడకను తలపిస్తోంది. ఈ పంట ప్రారంభించిన మొదట్లో సర్వర్ సమస్యలు తలెత్తడంతో మళ్లీ యాప్‌ను అప్‌డేట్ చేశారు. కానీ, క్షేత్రస్థాయిలో ఆశించిన వేగంగా ప్రక్రియ సాగడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 28 మండలాల్లో 32,220 మంది రైతులకు సంబంధించిన 97,542 ఎకరాలను మాత్రమే ఈ పంటలో నమోదు చేశారు.

గత ప్రభుత్వంలో ఇలా..

పంట రుణాలు, సున్నా వడ్డీ, పెట్టుబడి రాయితీ, పంటల బీమా, పంట నష్ట పరిహారంతోపాటు పండించిన పంటలను కనీస మద్దతు ధరతో అమ్ముకునేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ క్రాప్‌ను పకడ్బందీగా చేపట్టేది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నష్టం వస్తే వెంటనే రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టింది. విత్తనం వేసిన వెంటనే రైతులు తమ పంట వివరాలను ఆర్బీకేలో నమోదు చేసేవారు. ఆ తర్వాత వ్యవసాయ, ఉద్యాన సహాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలను యాప్‌లో నమోదు చేసేవారు.

ఇప్పుడు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ క్రాప్ పేరును ఈ పంటగా.. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చేసింది. కానీ, క్షేత్రస్థాయిలో సాగైన పంటలను ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు మాత్రం మీనమేషాలు లెక్కించింది. ఈ క్రాప్ నమోదుపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో తీరిగ్గా మేల్కొన్న ప్రభుత్వం వారం రోజుల కిందట పంటల సాగు వివరాలను ఈ - పంటలో నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చింది.

పంట నష్టపోతే పరిస్థితి ఏంటి?

ఆత్మకూరు, పగిడ్యాల, కొత్తపల్లి, జూపాడుబంగ్లా, ఆత్మకూరు రూరల్, వెలుగోడు, పాములపాడు, మిడుతూరు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఈ మండలాల్లో సాగులో ఉన్న మొక్కజొన్న, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దాదాపు 11 వేల హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మరోవైపు ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు, సంజామల, బనగానపల్లె, డోర్నిపాడు, శిరివెళ్ల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ మండలాల పరిధిలో పంట నష్టపోతే పరిహారం ఎలా అందజేస్తారో వ్యవసాయాధికారులు చెప్పలేకపోతున్నారు.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో..

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కురవాల్సిన వర్షపాతం కంటే 62 శాతం ఎక్కువగా కురిసింది. దీంతో రైతన్నలు ఆనందంతో చేళ్ల దుక్కులు దున్ని సాగుకు భూమిని సిద్ధం చేసుకున్నారు. జూలై, ఆగస్ట్ మొదటి వారంలో వరుణుడు పూర్తిగా ముఖం చాటేశారు. ఆళ్లగడ్డ, నంద్యాల, బనగానపల్లె, డోన్, పాణ్యం నియోజకవర్గాల్లో పదునుపాటి వర్షంకూడా పడలేదు. మరోవైపు జూపాడుబంగ్లా, శ్రీశైలం, ఆత్మకూరు, మహానంది, మిడుతూరు, పగిడ్యాల మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో పంటలు వాడుముఖం పడుతుండగా అత్యధికంగా వర్షపాతం నమోదైన మండలాల్లో పంటలు నీటిలో మునిగిపోయి రైతుకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తమకు అందిన ఫిర్యాదులు తిరిగి పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ సమావేశ భవనంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ రకాల ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరమైన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపామన్నారు. మరి కొన్ని ఫిర్యాదులు ఆయా స్టేషన్ అధికారులకు రెఫర్ చేశామన్నారు. అన్నదమ్ముల కలహాలు, ఆస్తి తగాదాలు, భార్యాభర్తల వివాదాలు తదితర అంశాలపై అధిక అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ సంతోష్ పాల్గొన్నారు.

భర్తను వీడలేక..

- ఐదు రోజుల క్రితం భర్త మృతి
- మనస్తాపంతో భార్య ఆత్మహత్య

శిరివెళ్ల: పదిహేను సంవత్సరాల క్రితం వారికి వివాహమైంది. సంతానం కలుగలేదు. కష్టం చేసుకుంటూ ఒకరికొకరు తోడుగా జీవించారు. ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో భర్త మృతి చెందగా.. ఇక ఎవరి కోసం బతకాలంటూ భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన వనికినిదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు వనికినిదిన్నెకు చెందిన జిలకర్ర అశోక్‌తో రుద్రవరం మండలం ఆలమూరుకు చెందిన శాంతికి (40) 15 ఏళ్ల క్రితం వివాహమైంది. దంపతులు తిరుపతిలో పాలీస్ బండలపై బొమ్మలు చెక్కే పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి సంతానం లేదు. కాగా ఐదు రోజుల క్రితం అశోక్ గుండెపోటుతో తిరుపతిలో మృతి చెందాడు. స్వగ్రామం వనికినిదిన్నెలో అంత్యక్రియలు చేశారు. ఈ క్రమంలో ఈ నెల 1వ తేదీ ఆదివారం కర్మకాండ కార్యక్రమాన్ని నిర్వహించారు. భర్త మృతితో తీవ్ర ఆందోళనలో ఉన్న శాంతి ఆదివారం రాత్రి ఇంటి వెనుక ఉన్న జీవాల పాకలో ఆత్మహత్య చేసుకుని విగతజీవిగా మారింది. తెల్లవారుజామున కుటుంబీకులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంట నష్టంపై నివేదిక ఇవ్వండి

- కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): జిల్లాలో భారీ వర్షాలతో వాటిల్లిన పంట నష్టంపై వెంటనే ప్రాథమిక నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా భారీ వర్షాలు, పీజీఆర్ఎస్, సంక్షేమ హాస్టళ్ల పనితీరు, ఈ-పంట, పారిశుద్ధ్యం, రక్షిత మంచినీటి సరఫరా తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో లోతట్టు వంతెనలపై వాహనాల రాకపోకలు నిషేధించాలన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన స్థితిలో ఉన్నాయని, వర్షాల నేపథ్యంలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లను ఆర్డీఓలు, తహసీల్దార్లు, స్పెషల్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ వాస్తవ నివేదికను ఇవ్వాలన్నారు.

ఉధృతి తగ్గని ఎద్దులేరు వాగు



తాడు సహాయంతో ఎద్దులేరు వాగును దాటుతున్న వారిని నిలువరిస్తున్న పోలీసులు



పుట్టిలో వాగు దాటుతున్న దృశ్యం

కొత్తపల్లి: భారీ వర్షాల కారణంగా శివపురం సమీపంలోని ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లమల అడవుల్లో నుంచి భారీగా వరద నీరు వాగుకు చేరడంతో వంతెనపై నుంచి ప్రవాహం కొనసాగుతోంది. వాగు అవతలి వైపు ఉన్న శివపురం, ముసలిమడుగు, సింగరాజుపల్లె, బట్టువారిపల్లె, గుమ్మడాపురం, ఎర్రమఠం, కపిలేశ్వరం, మాడుగుల గ్రామాల ప్రజలు ఊరికే పరిమితమయ్యారు. ముసలమడుగు గ్రామానికి చెందిన ఓ యువకుడు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో పుట్టి సహాయంతో వాగు దాటించి ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. చిన్న గుమ్మడాపురం, ముసలమడుగు గ్రామాల్లో ఆదివారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి అంత్యక్రియలకు వచ్చిన బంధువులు శివపురం సమీపంలోని వాగు వద్దనే ఆగిపోవాల్సి వచ్చింది. చివరకు వెనుదిరిగి వెళ్లారు. తహసీల్దార్ ఉమారాణి, ఎస్ఐ కేశవ సోమవారం ఎద్దులేరు వాగు ఉధృతిని పరిశీలించారు. ప్రయాణాలు ఎవరూ చేయవద్దని ఇళ్లలోనే ఉండాలని సూచించారు. నీటి ప్రవాహం పూర్తిగా తగ్గేవరకు వంతెనపై రాకపోకలు అడ్డుకునేలా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రజలు ఎవరూ తాడు, పుట్టీ సహాయంతో గాని వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, శివపురం సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ పలువురు వాగును పరిశీలించారు.

రాజన్నా.. జోహార్

- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి
- నివాళ్లులర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు
- మహానేత సంక్షేమ పథకాలను గుర్తు చేసుకున్న వైనం



నంద్యాల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా తదితరులు



బనగానపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ నేతలు



కల్లూరు మండలం శరీన్ నగర్‌లో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బొమ్మలసత్రం: జన హృదయాల్లో కొలువైన మహానేత వైఎస్సార్‌ను ప్రజలు మనసారా స్మరించుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సంక్షేమ పాలనను గుర్తు చేసుకున్నారు. ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం పథకాలతో పేదల జీవితాలు మారిపోయాయని వక్తలు కొనియాడారు. నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి స్వగృహంలో ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, పార్టీ నేతలు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. అనంతరం పట్టణంలోని శ్రీనివాస సెంటర్, సాయిబాబానగర్, చామకాల్వ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు భారీ పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భం ఎమ్మెల్సీ మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు సీఎంగా ఉన్న సమయంలో సంక్షేమ పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వైఎస్సార్ మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువగా ఏపీ, తెలంగాణలో నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. ఆరోగ్యశ్రీతో ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు సునీత అమృతరాజ్, చంద్రశేఖర్, డాక్టర్ శశికళారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

➡ బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణం సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను, సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించి పేదలకు ఎంతో మేలు చేశారన్నారు. కొలిమిగుండ్ల మండల కేంద్రంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

➡ ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి వైఎస్సార్ స్మృతి వనం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వైఎస్సార్ స్మృతి వనంలోని వైఎస్సార్ విగ్రహానికి భారీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్డు కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలలు వేసి నివాళ్లులర్పించారు.

➡ నందికొట్కూరు పట్టణంలోని కర్నూలు రోడ్డు, కోటవీధి, పాత బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు, జూపాడుబంగ్లా, పాములపాడు మండల కేంద్రాల్లోని విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, ఉపేంద్రరెడ్డి, లక్ష్మిరెడ్డి, అబుబకార్, కార్యకర్తల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ లాంటి మహా నాయకుడు మరణించడాన్ని రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వైఎస్సార్ పాలన ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని కొనియాడారు.

➡ డోన్ పట్టణంలో ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి స్వగృహంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు బద్దెల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుస్సేన్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

➡ కల్లూరు మండలం శరీన్ నగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వెస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. పాణ్యం సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.